క్లుప్తంగా

ఎమ్మెల్యే సంజయ్‌ను కలిసిన న్యాయవాదులు


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం వివిధ సమస్యలపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కోర్టులో ప్రభుత్వ తరఫు న్యాయవాది పోస్టును మంజూరు చేయించాలని, కోర్టు పార్కింగ్ స్థలంలోని వీఆర్‌ఏ భవనాన్ని జిల్లా కోర్టుకు అప్పగించాలని, న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, న్యాయవాదుల భవనం కోసం నిధులు విడుదల చేయాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కోశాధికారి చంద్రమోహన్ తదితరులున్నారు.

సంక్షేమానికి మారుపేరు తెలంగాణ


బాడీ ఫ్రీజర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోరుట, కోరుట్ల రూరల్: దేశంలోనే సంక్షేమానికి మారుపేరుగా తెలంగాణ నిలుస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. కోరుట్ల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో సోమవారం లబ్ధిదారులకు పింఛన్‌కార్డులు, గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేశారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపామన్నారు. ఈసారి ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడని, గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ రాజేశ్వర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ నారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు లావణ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, వైస్ ఎంపీపీ స్వరూపారాణి తదితరులున్నారు.

సామాజిక స్పృహ అలవర్చుకోవాలి

మల్లాపూర్: ప్రజలందరూ సామాజిక స్పృహ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం రాఘవపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాపారవేత్త ముద్దం రాజేంద్రప్రసాద్ తన తల్లిదండ్రులు, అన్నల జ్ఞాపకార్థం అందించిన రెండు బాడీ ఫ్రీజర్లను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ నాగేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల ముందు వచ్చేవారిని నమ్మొద్దు'


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: ఎన్నికల ముందు వచ్చి, తర్వాత వెళ్లిపోయే నాయకులను నమ్మొద్దని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు అందుబాటులో ఉండి, పని చేస్తున్నానని, తనను రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలన్నారు. పోతారంలో పద్మశాలీ సంఘ భవనం, శ్రీ భవాని శంకర సీతారామాంజనేయ దేవాలయం పునఃనిర్మాణం, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు, రాజారం నుంచి చెప్యాల రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మల్యాల మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్ రావు, మాజీ ఎంపీపీ అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ సాగర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పాలకవర్గాన్ని రద్దు చేయాలి

మెట్‌పల్లి: పరీక్షల నిర్వాహణలో పూర్తిగా విఫలమైన టీఎస్‌పీఎస్సీ పాలకవర్గాన్ని తక్షణమే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వతంత్రంగా పని చేయాల్సిన బోర్డు పూర్తిగా సీఎం కేసీఆర్ కుటుంబ సంస్థగా మారిందని విమర్శించారు.


గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


రాయికల్‌లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి..



జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, నాయకులు


మెట్‌పల్లి: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

జగిత్యాలజోన్: గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. మహాత్ముని చిత్రపటానికి నివాళి అర్పించారు. గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఇన్‌చార్జి జెడ్పీ సీఈవో నరేశ్, డిప్యూటీ సీఈవో రఘువరణ్, అడిషనల్ డీఆర్‌డీఏ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంతోపాటు, మండలంలోని 32 గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంధ్యారాణి, దావన్‌పల్లిలో జెడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేశ్, కాంతారావు, ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంతోపాటు భూషణరావుపేట, అంబారిపేట, కథలాపూర్ గ్రామాల్లో గాంధీజీ చిత్రపటాలకు నివాళి అర్పించారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల, కోరుట్లరూరల్: పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు గాంధీజీ విగ్రహాలకు నివాళి అర్పించారు. మూదాపూర్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు లావణ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నారాయణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, జువ్వాడి భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు.

జగిత్యాల: గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధిపతి శ్రీనివాస్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులు కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ బలరాం, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. పొలాస వ్యవసాయ కళాశాలలో సోమవారం గాంధీజీ చిత్రపటానికి ప్రొఫెసర్లు, విద్యార్థులు నివాళి అర్పించారు. జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో గాంధీజీ, దేశ రెండో ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి నిర్వహించారు. ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, టెక్నికల్ డీఈ గంగారాం, టెక్నికల్ ఏడీ నగేశ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఇన్‌చార్జి ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో రాజేశ్వరి, సూపరింటెండెంట్ గంగాధర్ సోమవారం నివాళి అర్పించారు. అర్బన్ ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ లక్ష్మి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేశారు. మోరపల్లి గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకు, పెంబట్లలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఎంపీపీలు జమున, రమేశ్, జెడ్పీటీసీ సభ్యులు మనోహర్‌రెడ్డి, పద్మ, అధికారులు, ప్రజాప్రతినిధులున్నారు. పెంబట్లలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రపంచంలో మన దేశం అగ్రస్థానంలో ఉండటానికి కారణం శాంతియుత, సెక్యులర్ వ్యవస్థ అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెగడపల్లి: తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. మద్దులపల్లిలో గాంధీ విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎం.ఎ.రఫీక్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేటలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను బీజేపీ గ్రామశాఖ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. వారి చిత్రాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మహేశ్, ఉపాధ్యక్షుడు భీమా మహేశ్, బండారి నరేశ్, దాసరి మల్లయ్య, బాలయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: బాపూజీ బాటలో నడవడమే మనమంతా ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని పురాణిపేట గాంధీజీ విగ్రహానికి పూలమాల వేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ నివాళి అర్పించారు. డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, కమిషనర్ రమేశ్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులున్నారు.

ఇబ్రహీంపట్నం: స్థానిక పాత బస్టాండ్ వద్ద సర్పంచ్ లత ఆధ్వర్యంలో, వేములకుర్తి తదితర గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు రాములు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కొమిరెడ్డి లింగారెడ్డి తదితరులున్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు నివాళి అర్పించారు. జాతీయ రహదారిపై ఉన్న గాంధీ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు, సిబ్బంది పూలమాలలు వేశారు.

బుగ్గారం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజేందర్, ఎంపీపీ రాజమణి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్, కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఆయన విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపసర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ కృషితోనే పసుపు బోర్డు

కోరుట్ల: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషితోనే రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారని బీజేపీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంగళవారం నిజామాబాద్‌లో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభకు ప్రజలను భారీగా తరలించాలని కోరారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, వెంకట్, సునీతాదేవి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పసుపు బోర్డు తీసుకువచ్చి, ఎంపీ అర్వింద్ తన హామీ నిలబెట్టుకున్నారని బీజేపీ నాయకులు అన్నారు. మెట్‌పల్లిలో సోమవారం ప్రధాని మోదీ, ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం గంగాధర్, నాయకులున్నారు.

కథలాపూర్: రైతులకు మేలు చేయడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పసుపు బోర్డు ప్రకటన చేయడంతో సిరికొండలో సోమవారం టపాసులు కాల్చారు. నాయకులు వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.


మెట్‌పల్లిలో ప్రధాని, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: పసుపు బోర్డు ప్రకటించడంతో రైతుల్లో ఆనందం నింపిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. పసుపు బోర్డు కళను నిజం చేసిన ఎంపీ అర్వింద్‌ను సోమవారం నిజామాబాద్‌లోని బీజేపీ ఆఫీస్‌లో కలిసి, బొట్టు పెట్టి, సంబరాల్లో పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల జిల్లా పసుపు రైతులు సోమవారం ఎంపీ అర్వింద్‌ను నిజామాబాద్‌లో కలిశారు. పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి, సన్మానించారు. పసుపు రైతుల ఉద్యమ నాయకుడు తిరుపతి రెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నారాయణ రెడ్డి, నాయకులున్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రధాని నరేంద్రమోదీ పసుపు బోర్డు ప్రకటించడం అభినందనీయమని జిల్లా రైతు ఉద్యమ నేత బద్దం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ పర్యటనలో ఈ సీజన్ నుంచే పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని కొత్త బస్టాండ్ వద్ద రైతులతో కలిసి, ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

జగిత్యాలరూరల్: పొలాస గ్రామంలో బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాజశేఖర్, రాజు, దామోదర్, తిరుపతి తదితరులున్నారు.

మల్లాపూర్: వీవీరావుపేటలో ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు బీజేపీ నాయకుడు పెనుకుల అశోక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నరేశ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, నాయకులున్నారు.

మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రికి నివాళి

మెట్‌పల్లి: మాజీ ప్రధానమంత్రి, దివంగత లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని మెట్‌పల్లి పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దొంతుల అంజనేయులు, ఇల్లెందుల శ్రీధర్, గంగుల మురళి, చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్ తదితరులున్నారు.


నివాళి అర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జగిత్యాలటౌన్: మాజీ ప్రధాని, దివంగత లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని సోమవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో నిర్వహించారు. భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. సమితి నాయకుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ.. లాల్‌బహదూర్ శాస్త్రి సాహసోపేతమైన నిర్ణయాలు దేశ ప్రజల్లో దేశభక్తిని రగిల్చాయని అన్నారు. గాంధేయవాది అయిన ఆయన తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండారి మల్లికార్జున్, అరవ లక్ష్మి, సమితి ప్రతినిధులు కాశీనాథం, పోచమల్లు, దేవరాజం, మహేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మల్యాల: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన దీక్ష సోమవారం 22వ రోజుకు చేరింది. స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి, వారికి సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణు, మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయకులున్నారు.

రాయికల్: పట్టణంలో గాంధీజీ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు.

గొల్లపల్లి: అంగన్‌వాడీల సమ్మె సోమవారం 22వ రోజుకు చేరింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పెగడపల్లి: స్థానిక గాంధీజీ చిత్రపటానికి అంగన్‌వాడీలు సోమవారం వినతి పత్రం అందజేసి, నిరసన తెలిపారు. అంతకుముందు సీఎం కేసీఆర్ తమ సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతూ స్థానిక రాజరాజేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

బాపూజీ విగ్రహంపై పట్టింపేది?


చేతులు విరిగిన గాంధీజీ విగ్రహం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ గాంధీజీ విగ్రహం రెండు చేతులు విరిగి, కర్ర, అద్దాలు లేవు. గాంధీ జయంతి రోజు కూడా ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. విగ్రహానికి మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


రమణారెడ్డికి కండువా కప్పిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని కొండపూర్‌కు చెందిన ఆర్మీ రిటైర్డ్ అధికారి కందుల రమణారెడ్డి, వివిధ పార్టీల కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కండువాలు కప్పారు. కార్యక్రమంలో పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యం, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు న్నారు.

'ప్రధానిని విమర్శించే స్థాయి సీఎంకు లేదు'

జగిత్యాలటౌన్: దేశ భద్రతతోపాటు ప్రజలందరి సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుతున్న ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎం కేసీఆర్‌కు లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఉత్తర తెలంగాణలో పసుపు పంటపై ఆధారపడే రైతన్నలకు అండగా నిలిచేందుకు పసుపు బోర్డు ప్రకటించారని తెలిపారు. నూకపెల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో మెజారిటీ హిందువులను కాదని మైనారిటీలకు ప్రత్యేక కోటా కింద ఇళ్ల కేటాయింపు ఓటు బ్యాంకు రాజకీయమేనని మండిపడ్డారు. నాయకులు ఏసీఎస్ రాజు, లింగంపేట శ్రీనివాస్, గుర్రం రాము, మాడిశెట్టి మల్లేశం, నారాయణరెడ్డి తదితరులున్నారు.

జర్నలిస్టుల డిమాండ్లు నెరవేర్చాలి

ధర్మపురి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తున్న జర్నలిస్టుల డిమాండ్లను నెరవేర్చాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ధర్మపురి పట్టణంలోని నంది విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గణేశ్‌కు వినతిపత్రం అందించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, రైల్వే పాసులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అధ్యక్షుడు మధు మహదేవ్, సీనియర్ పాత్రికేయులు రామకిష్టయ్య, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు తదితరులున్నారు.


ధర్మపురిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మీడియా రక్షణ చట్టం అమలు చేయాలి

వెల్గటూర్: దేశంలో మీడియా రక్షణ చట్టం అమలు చేయాలని వెల్గటూర్ మండల జర్నలిస్టులు కోరారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీటి శ్రీనివాసరావు, మోరపల్లి ప్రదీప్‌కుమార్ పిలుపు మేరకు మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, రైల్వే పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల ర్యాలీ

మల్లాపూర్: ఆశవర్కర్లు సోమవారం గాంధీ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

కథలాపూర్: మండల కేంద్రంలో ఆశాలు ర్యాలీ తీశారు. సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

రాయికల్: పట్టణంలో ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు గాంధీజీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలరూరల్: ధరూర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో సోమవారం రెడ్ల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కథలాపూర్: కలిగోటలో జై భీమ్ యూత్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబటి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కొడిపెల్లి రఘు, కోశాధికారిగా కొడిపెల్లి రక్షిత్ ఎన్నికయ్యారు.

5న చలో హైదరాబాద్

జగిత్యాలటౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 5న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకం


స్వాతి

కోరుట్ల: స్థానిక పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల విద్యార్థిని అడ్లగట్ట స్వాతి 18 ఏళ్లలోపు అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల హార్డిల్స్‌లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించింది. కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ సోమవారం అభినందించారు.

యువకుడికి సన్మానం

రాయికల్: కిష్టంపేటకు చెందిన పూదరి సత్తయ్య–గంగు దంపతుల కుమారుడు మణివర్మ ఇటీవల అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ స్వరూప అతన్ని సన్మానించారు.

రైతులను మభ్యపెట్టేందుకే పసుపు బోర్డు ప్రకటన

కోరుట్ల: రైతులను మరోసారి మభ్యపెట్టేందుకే ప్రధాని మోదీ ద్వారా పసుపు బోర్డు ప్రకటన చేయించారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం కోరుట్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ పార్లమెంటు ఎన్నికల్లో గెలిపిస్తే వంద రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని, లేకుండా రాజీనామా చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి, మోసం చేశారన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పారని, ఆ మాట ఏమైందని ప్రశ్నించారు.

కొనసాగుతున్న ఈ-పంచాయతీ ఆపరేటర్ల సమ్మె

జగిత్యాలటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ–పంచాయతీ ఆపరేటర్లు మహాత్ముని చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. టీఎన్జీవో నాయకులను కలిసి, తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేసి, ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శి సాంబశివ, జిల్లా అధ్యక్షుడు గొట్టె రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన గూడ స్వామిరెడ్డి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. స్వామిరెడ్డి ఆదివారం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వేరే ఊరికి వెళ్లాడు. సోమవారం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 18గ్రాముల బంగారం, రూ.20వేల నగదు కనిపించలేదు. దొంతగనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

